క్లుప్తంగా

పార్ట్‌టైం ఉపాధ్యాయుల తొలగింపుపై విప్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న పార్ట్‌టైం, సీఆర్టీ ఉపాధ్యాయులు

ధర్మపురి: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం, సీఆర్టీ ఉపాధ్యాయులను తొలగించడంపై బుధవారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విప్ స్పందించి ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పార్ట్ టైం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టిగణపతులను పూజించాలి



మట్టిగణపతులు తయారుచేసిన అధ్యాపకులు

జగిత్యాల: ప్రతీ ఒక్కరు మట్టిగణపతులను ప్రోత్సహించాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ అన్నారు. బుధవారం డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ హిత గణపతుల తయారీ చేపట్టారు. ఇందులో కూరగాయలు, పసుపు, గోధుమపిండి ఆకులతో తయారుచేసి గణపతులను తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో పర్యావరణం కాలుష్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు సుజాత, శ్రీలత, సంగీతరాణి, అకడమిక్ కో–ఆర్డినేటర్ ప్రమోద్‌కుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ సిబ్బంది నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సిబ్బంది

కోరుట్ల: తెలంగాణ విద్యుత్ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఎస్సీ,ఎస్టీ విద్యుత్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ కోసం మూడు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తెడ్డు గంగారాం, సీనియర్ నాయకులు బండ రాజు వీరు, మెట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు వెన్నమల్ల శ్రీనివాస్, కోమ్ము సంపత్, తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు

జగిత్యాలక్రైం: పట్టణంతో పాటు సరిపరాల ప్రాంతాల్లో ఎవరైనా సామాజిక మాధ్యమాలలో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవని టౌన్ సీఐ వేణుగోపాల్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంత ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ఎవరైనా విద్వేషాలను రెచ్చగొట్టేలా వీడియోలు గానీ, ఫోటోలు గానీ ఏవైనా రాతపూర్వక సందేశాలను పోస్ట్ చేస్తే వారిని వెంటనే గుర్తించి కఠినచర్యలు తీసుకుంటామన్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు సమన్వయంతో పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే

జగిత్యాలక్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష ఖాయమని ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన వాహనాల తనిఖీలో మేడిపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన వేములవాడ మహేశ్ మద్యం సేవించి పట్టుపడ్డాడు. కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా మహేశ్‌కు న్యాయమూర్తి నాలుగు రోజుల జైలుశిక్ష విధించిందని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనదారుల అజాగ్రత్త చర్యల వల్ల ఎదురువారి ప్రాణాలు కూడా పోతున్నాయన్నారు. ఏ వాహనదారుడు కూడా మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు.

వైద్య సేవలు మెరుగయ్యేదెన్నడో?

- మండలమైనా ఫలితం శూన్యం
- పీహెచ్‌సీ ఏర్పాటుపై తాత్సారం
- ఆరోగ్య ఉపకేంద్రంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్



ఆరోగ్య ఉపకేంద్ర భవనంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

బుగ్గారం: బుగ్గారం నూతన మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా వైద్యసేవల కోసం స్థానిక ప్రజలు ఇంకా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. వివిధ రకాల చికిత్సల కోసం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులే దిక్కవుతున్నాయి. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పాముకాటుకు గురైన సందర్భాల్లో గతంలో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు సైతం ఉన్నాయి. మండలంలో మొత్తం 5 ఆరోగ్య ఉపకేంద్రాలుండగా, వీటిలో కేవలం సిరికొండలో మాత్రమే సొంత భవనంలో కొనసాగుతోంది. మిగతా గోపులాపూర్, వెల్గొండ, శెకెల్ల,బుగ్గారం గ్రామాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. బుగ్గారంలో సొంత భవనం ఉన్నప్పటికీ అందులో పోలీస్‌స్టేషన్ కొనసాగుతోంది.

పీహెచ్‌సీ నిర్మించేదెన్నడూ..

బుగ్గారం మండల కేంద్రంలో పీహెచ్‌సీ నిర్మించాలిసిందిగా మండల వాసులు ఏళ్లుగా కోరుతున్నారు.ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్య ఉపకేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో పీహెచ్‌సీ నిర్మాణానికి అనువైన స్థలానికి మండల కేంద్రంలోని పలు ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా పీహెచ్‌సీ నిర్మించడానికి అనువైన స్థలం ఎంపిక సైతం ఇంకా పూర్తికాలేదు.

మండల కేంద్రంలో అయితేనే అందరికీ సౌకర్యం

ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలోనే పీహెచ్‌సీని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. వివిధ రకాల వైద్యసేవల కోసం నిత్యం ప్రజలు వచ్చేది కావున ఊరికి దూరంగా నిర్మిస్తే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు కోరుతున్నారు. బుగ్గారంలోనే అందుబాటులో ఉన్న స్థలాన్ని ఎంపిక చేయాలని అత్యధిక మంది ప్రజలు కోరుతున్నారు. దీని కోసం పలువురు స్థానిక నాయకులు,ప్రజలు సైతం ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించారు. మండల కేంద్రంలో నిర్మిస్తేనే అన్ని గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో స్థలాన్ని త్వరగా ఎంపిక చేసి పీహెచ్‌సీ నిర్మాణాన్ని ప్రారంభించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పీహెచ్‌సీ నిర్మాణం వెంటనే చేపట్టాలి



బుగ్గారం మండలంలో ప్రజలకు మెరుగైన ఆరోగ్య వసతి కల్పించడానికి అన్ని రకాల సదుపాయాలతో మండల కేంద్రంలో వెంటనే పీహెచ్‌సీ నిర్మాణం చేపట్టాలి.అనేక రకాల అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రైవేట్ ఆస్పత్రులే దిక్కవుతున్నాయి. దీని వలన ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– పల్లికొండ అనిల్.వెల్గొండ గ్రామం

గ్రంథాలయాల బలోపేతానికి కృషి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: గ్రామపంచాయతీల్లో లైబ్రరీ సెస్ వసూలు చేసి, గ్రంథాలయాల బలోపేతానికి కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను పరిశీలించారు. అనంతరం పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. లైబ్రరీలో విద్యుత్, స్టేషనరీ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కేంద్ర గ్రంథాలయానికి వచ్చి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో రూ కోటి రూపాయలతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని త్వరగా పూర్తిచేయిస్తామన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు కూసరి అనిల్, ముస్కు నారాయణరెడ్డి నాయకులు చెట్పల్లి సుధాకర్ తదితరులు ఉన్నారు.

నవరాత్రులను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

మల్లాపూర్: గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మండపాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఎవరూ గొడవలకు వెళ్లవద్దని, డీజే సౌండ్‌ను నిషేధించామని, వాడితే నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. మైక్‌లకు పోలీస్‌శాఖ, విద్యుత్ సరఫరాకు ట్రాన్స్‌కో ఏఈ అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో వీడీసీ చైర్మన్ సంగ గంగరాజం, వైస్ చైర్మన్ ఇల్లెందుల తుక్కరాం, గణేశ్ మండపాల నిర్వాహకులు మ్యాకల సతీష్, పుప్పాల మహేష్, ముత్యాల నరేష్, న్యావనంది నికేష్, అజయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

వంతెన పునరుద్ధరణకు చర్యలు



వంతెనను పరిశీలిస్తున్న నర్సింగరావు

కోరుట్ల/కోరుట్లరూరల్/మెట్‌పల్లి/మల్లాపూర్: మండలంలోని కల్లూరు వాగుపై వంతెన పునరుద్ధరణకు సత్వర చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మూడు రోజుల క్రితం వాగు ఉధృతికి తెగిపోయిన వంతెనను బుధవారం పరిశీలించి జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. ప్రస్తుతానికి వంతెనపై రాకపోకలు పునరుద్ధరణకు తాత్కాలిక చర్యలు చేపట్టాలని, శాశ్వత పరిష్కారానికి హైలెవల్ వంతెన కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయించాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం కల్లూర్ రోడ్‌లోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమాల్లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నయీమ్, ఏఎంసీ అధ్యక్షుడు అంజయ్య, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, కౌన్సిలర్లు తిరుమల గంగాధర్ గౌడ్,సంగ మాలతీ లింగం యాదవ్, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ పోతుగంటి మంగ, హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు, నాయకులు అన్నం అనిల్, పుప్పాల ప్రభాకర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ విశేష సేవలు

లయన్స్ క్లబ్ ద్వారా పేద ప్రజలకు విశేష సేవలందుతున్నాయని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. లయన్స్ క్లబ్ సభ్యుడు వెల్ముల శ్రీనివాసరావు జన్మదినం పురస్కరించుకుని విద్యార్థులకు సైకిల్ కొనుగోలు చేశాడు. నర్సింగరావు విద్యార్థులకు సైకిల్‌ను అందజేసి శ్రీనివాసరావును సత్కరించారు.

కాంగ్రెస్‌లో చేరిక

మల్లాపూర్ మండలంలోని సిరిపూర్ గ్రామానికి చెందిన బీజేపీ మహిళా మోర్చా జిల్లా నాయకురాలు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బదిలీల్లో జరిగిన లోటుపాట్లు సవరించాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

జగిత్యాల: వర్క్‌అడ్జస్ట్‌మెంట్, బదిలీల్లో జరిగిన బదిలీల్లో జరిగిన లోటుపాట్లు సవరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్, భూమేశ్వర్ డీఈవో జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ విడుదల చేసిన జాబితాలో జగిత్యాల రూరల్ మండలానికి చెందిన ఒక ఉపాధ్యాయురాలు సారంగాపూర్ మండలానికి ట్రాన్స్‌ఫర్ అయినప్పటికీ సదరు ఉపాధ్యాయురాలిని రిలీవ్ చేయకుండా అదే జగిత్యాల రూరల్ మండలం నుంచి అర్బన్ మండలానికి వర్క్‌అడ్జస్ట్‌మెంట్ కింద పంపడం సరికాదన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, బదిలీల్లో స్పౌజ్‌లో జరిగిన పొరపాట్లను సవరించాలని కోరారు.

గోదావరి తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్సారెస్పీ ఈఈ వెంకటేశ్వర్, తహసీల్దార్ వీర్‌సింగ్

మల్లాపూర్: గోదావరి నది తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వీర్‌సింగ్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని వాల్గొండలో గోదావరి నది వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరినదితో పాటు పెద్దవాగు వరద ఉధృతితో ప్రమాదకరంగా మారినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అంచనా వేయాలన్నారు. ఆయా గ్రామాల ప్రజలు గోదావరి నది, పెద్దవాగు, చెరువుల్లో చేపల వేటతో పాటు స్నానాలకు, వెళ్లొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

• ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

ధర్మపురి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలకు చెందిన విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బహుమతుల దాత చాడ బుచ్చన్న, హెచ్ఎం కాసర్ల నర్సింహమూర్తి, కాంప్లెక్స్ హెచ్ఎం కొలిచాల శ్రీనివాస్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బాలె గంగాధర్, పీఈటీలు, టీచర్లు పాల్గొన్నారు.

• అంగన్‌వాడీ కేంద్రానికి క్రీడా సామగ్రి అందజేత

ధర్మపురి: తమ మనుమడి పుట్టిన రోజు సందర్భంగా ధర్మపురికి చెందిన పెండ్యాల బాలకృష్ణ, విజయలక్ష్మి దంపతులు న్యూ హరిజన వాడ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి బుధవారం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి చిన్నారులు ఆడుకోవడానికి ఉపయోగ పడే జారుడు బల్లలను బహూకరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ మాధవిలత వారికి కృతజ్ఞతలు తెలిపారు.

• దావన్‌పల్లిలో పోషణ్ మాస వేడుకలు

రాయికల్: మండలంలోని దావన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాస వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార పదార్థాల గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి వీణారాణి, అంగన్‌వాడీ టీచర్ రోజా పాల్గొన్నారు.

• చౌకధర దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

మల్యాల: మండలంలోని పలు చౌకధర దుకాణాల్లో బుధవారం పౌరసరఫరాల శాఖ టాస్క్ ఫోర్స్ అధికారి కృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బియ్యం నిల్వలు పరిశీలించారు. దుకాణాల వద్ద లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహాస్వామి, నాయబ్ తహసీల్దార్ బి. శ్రీనివాస్ పాల్గొన్నారు.


బావి పూడ్చివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామ శివారులోని ఎస్సీ కాలనీలోని ఓ బావి నిరుపయోగంగా ఉండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలతో భారీగా నీరు చేరి దుర్వాసన రావడంతో పంచాయతీ కార్యదర్శి కిరీటి స్వయంగా మట్టితోబావిని పూడ్చివేసి బావిని పూడ్చివేశారు. దీంతో కాలనీ వాసులు పంచాయతీ కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా చట్టాలపై అవగాహన

మెట్‌పల్లి: మహిళలపై జరుగుతున్న హింస, చట్టాలపై పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. సఖి కేంద్రానికి చెందిన పలువురు చట్టాల, పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

317 జీవో బాధితుల సమస్యకు త్వరలో పరిష్కారం



సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులు

వెల్గటూర్ : 317 జీవో బాధిత ఉపాధ్యాయుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని పీఆర్టీయూఎస్ జిల్లాశాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యాల్ల అమర్నాథ్‌రెడ్డి, బోయినపల్లి ఆనందరావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ 317 జీవోపై మంత్రివర్గ ఉపసంఘం త్వరలోనే తన నివేదికను ప్రభుత్వానికి అందజేసి, త్వరలోనే ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింగం, ప్రధాన కార్యదర్శి రవి, అసోసియేట్ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



సారంగాపూర్: జగిత్యాల నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు వచ్చే ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డు గతంలో సింగిల్‌రోడ్డుగా ఉండేది. దీనిని డబుల్‌రోడ్డుగా విస్తరించారు. డబుల్ రోడ్డుగా మార్చిన సమయంలో లక్ష్మీదేవిపల్లి, రేచపల్లి క్రాసింగ్ సమీపంలో లోలెవల్ కాజ్‌వేను అధికారులు తొలగించారు. దీంతో వర్షాలకు వాగుల ద్వారా వచ్చే వరదనీరు డబుల్ రోడ్డుపై నుండి భారీగా ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. లోలెవల్ కాజ్‌వే స్థానంలో కల్వర్టు నిర్మాణం చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ఈ సమస్యపై సంప్రదించాల్సిన అధికారి
ఆదిత్య ఆర్అండ్‌బీ ఏఈ,ఉమ్మడి సారంగాపూర్ నంబర్ : 9440818883

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

వెల్గటూర్‌లో భారీ వర్షం



గొడిశెలపేట- పైడిపెల్లి గ్రామాల మధ్య వంతెన పైనుంచి భారీగా ప్రవహిస్తున్న వరద నీరు

- స్తంభించిన జన జీవనం
- ఇళ్లలోకి చేరిన నీరు



ముత్తునూర్‌లో ఇళ్లలోకి చేరిన వరద నీరు

వెల్గటూర్ : మండలంలో బుధవారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి మండలం లోని వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. పైడిపెల్లి – గొడిశెలపేట గ్రామాల మధ్య వాగుకు భారీగా వరద నీరు చేరి వంతెన పై నుంచి వరద నీరు పారడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. అలాగే ముత్తునూర్ లో వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చాలా ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బియ్యం, బట్టలు, విద్యార్థుల పుస్తకాలు, నిత్యావసర వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

వెల్గటూర్ : ఎండపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు బుధవారం పాఠశాల హెచ్ఎం సన్మాన సభ నిర్వహించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు శ్రావణి, సంతోష్, జలజ, శంకరయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తులోనూ వారు ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. .

ఉత్తమ ఉపాధ్యాయుడికి ..

ఎండపల్లి మండలం గుల్లకోట ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న నరేష్ కుమార్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. హెచ్ఎం రాజిరెడ్డి పుష్పగుచ్ఛం అందించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది నరేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కబడ్డీలో సత్తా చాటిన బాలుడికి..

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన రామగిరి సిద్ధార్థ్ అనే విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో కబడ్డీ ఆడి భారత్ రెండో స్థానంలో నిలిపిన సందర్భంగా సిద్ధార్థ్‌ను జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు వొద్నాల రాజశేఖర్ బుధవారం ఘనంగా సన్మానించారు. అండర్– 14 విభాగంలో కబడ్డీలో భారత్ సిల్వర్ మోడల్ సాధించడంలో కీలక భూమిక పోషించిన సిద్ధార్థ్ మరింత రాణించాలని అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు తేలు రాజు, బండారి వెంకటేష్, తేలు ఆశన్న, ప్రమోద్, రాజన్న, బాదినేని రవి, తదితరులు పాల్గొన్నారు.

భీమారంలో ఉపాధ్యాయుడు, ఏవోకు..

మేడిపల్లి: గత తొమ్మిదేళ్లుగా భీమారం హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు బత్తుల సంపత్‌ను భీమారం గ్రామస్తులు బుధవారం సన్మానించారు. అలాగే బదిలీపై వెళ్తున్న మండల వ్యవసాయ అధికారి వంశీని మండల మాజీ సర్పంచ్‌లు, సహోద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో నాగేల్లి మహేశ్, ఆదే లక్ష్మిరాజం, ఆదే రమేశ్, చెక్కపెల్లి రఘు, అధికారులు అశోక్, సురేందర్ నాయక్, నరేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

మల్లాపూర్: మండల ఇన్‌చార్జీ ఎంపీడీవోగా ఎంపీవో తండ జగదీశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జగదీశ్‌ను ప్రత్యేకాధికారులు, మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపి శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో సతీశ్, మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు 'గురు బ్రహ్మ అవార్డు'

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకయ్యకు జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ సంస్థ 'గురు బ్రహ్మ' అవార్డును ప్రకటించింది. విద్యా రంగంలో కృషి చేసిన వారికి ప్రతి ఏటా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డుకు ఎంపిక చేస్తుంది. ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆయనకు అవార్డు ప్రదానం చేయనున్నారు.